

సాక్షి
పల్నాడు
బుధవారం । 21 । ఆగస్టు । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు వదిలారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7837 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 340 క్యూసెక్కులు వదిలారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు చివరి రోజైన మంగళవారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మహాపూర్ణాహుతి హోమంలో ఎమ్మెల్యే జీవీ పాల్గొన్నారు.

పంటలకు ఎండ దెబ్బ

ఆందోళనలో రైతులు

- మే నెలను తలపిస్తున్న పగటి ఉష్ణోగ్రతలు
- సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీలు అధికం
- జిల్లాలో రెండు వారాలుగా కురవని వర్షాలు
- వడబారిపోతున్న వరి, మిర్చి పంటలు
- తగ్గనున్న మొక్కల ఎదుగుదల
- అధికమైన రసం పీల్చే పురుగు, నల్లి పురుగుల పీడ
- మిర్చి నారుకు ఇబ్బంది అంటున్న నర్సరీ నిర్వాహకులు

ఆగస్టు నెల చివర్లో కూడా తీవ్ర ఎండలతో ఎండా కాలాన్ని తలపిస్తోంది. మే నెలలో మాదిరి పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయి. వర్షాకాలంలో అనుకోని విధంగా ఉన్న అధిక వేడిమి, ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. పెరిగిన ఉష్ణోగ్రతల ప్రభావం జిల్లాలోని పంటలపైనా పడుతోంది. సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో వాతావరణంలో తేమశాతం తక్కువగా ఉంటోంది. మరోవైపు జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కన్నా అధికంగా వానలు కురిసినప్పటికీ రెండు వారాలుగా జిల్లాలో అనుకున్న స్థాయిలో వర్షాలు కురడం లేదు. ఈ కారణాలతో పగటి పూట అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఖరీఫ్ పంటల సాగుపై ప్రభావం పడుతోంది.

పల్నాడులో ఎనిమిది రోజులుగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు...

తేదీ	గరిష్ట ఉష్ణోగ్రత డిగ్రీలలో	కనిష్ట ఉష్ణోగ్రత డిగ్రీలలో
13-08-2024	38.4	27
14-08-2024	34.8	27.2
15-08-2024	37.2	27.2
16-08-2024	36.6	27
17-08-2024	36.6	27.2
18-08-2024	37.2	27.2
19-08-2024	35.2	26
20-08-2024	35	26

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు లక్ష్యం 2,48,350 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 60,709 హెక్టార్లలో పంట సాగైంది. ఇందులో అత్యధికంగా పత్తి పంట 49,733 హెక్టార్లలో సాగైంది. పత్తి పంటకు అధిక ఉష్ణోగ్రతల వల్ల కొంత ఇబ్బంది నెలకొంది.

తగ్గనున్న ఎదుగుదల...పెరగనున్న చీడపీడలు

పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా మూడు నుంచి నాలుగు డిగ్రీలు పెరగడం వల్ల ముఖ్యంగా మొక్కలలో పెరుగుదల తగ్గుతుంది. మొక్క ఏపుగా పెరగకపోవడం పంట దిగుబడిపై ప్రభావం చూపనుంది. మరోవైపు పత్తి పంటలో రసం పీల్చే పురుగు, నల్లి పురుగుల ఉధృతి పెరగనుంది. దీని వల్ల రైతులు సాధారణం కన్నా ఎక్కువ పురుగు మందులు పిచికారీ చేయాల్సి ఉండటంతో పెట్టుబడి పెరగడంతోపాటు దిగుబడిపై ప్రభావం చూపనుంది. తీవ్రమైన ఎండ వల్ల ముఖ్యంగా దుర్గి, వెల్దుర్తి, మాచర్ల మండలాల్లో పత్తి పంటలో పూత, పిందెలు రాలుతున్నాయి.



మాచర్ల మండలం రాయవరం వద్ద ఎండకు వాడిపోయి పూత, పిందె రాలిన పత్తి పంట

వడబారిపోతున్న వరి, మిర్చి పైర్లు

జిల్లాలో ఖరీఫ్‌లో మిర్చి పంట 58,202 హెక్టార్లలో సాగవుతుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కేవలం 1,958 హెక్టార్లలో సాగైంది. మిగిలినిది మిరప నారు దశలో ఉంది. ఈ నారు అధిక ఉష్ణోగ్రతల వల్ల నారు వడబారిపోతోంది. నర్సరీలలో ఉన్న ఈ నారు ఎండలకు ఎండిపోయి, ఆకులు పసుపు రంగులో మారి మొక్కలు చనిపోతున్నాయి. మిర్చి నారుకు చీడపీడల బెడద అధికంగా ఉంటోంది. నర్సరీ నిర్వాహకులు నష్టపోతున్నారు. నారు ఎక్కువ సార్లు తడపటంతో పాటు మందులు పిచికారి అధికంగా చేయాల్సి ఉంది. మరోవైపు జిల్లాలో ఈ ఏడాది వరి సాధారణ సాగు 42,095 హెక్టార్లు కాగా ఇప్పటికి 3,611 హెక్టార్లు సాగైంది. అధికం భాగం వరి నారుమడి దశలో ఉంది. ఈ నారు ఎండలకు ఇబ్బందిపడుతున్నాయి.



రెంటచింతల నర్సరీలలో ఎండిన మిర్చి నారు

పంటలకు ఇబ్బందే..



ఆగస్టు నెల రెండో భాగంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం కొంత మేర పంటలకు ఇబ్బంది అవుతోంది. దీని వల్ల మొక్కల పెరుగుదలపై ప్రభావం ఉండనుంది. ఈ నెల 25వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. విస్తారంగా వర్షాలు కురిస్తే ఈ వేడి వాతావరణ ప్రభావం లేకుండా పోతుంది.

–ఐ మురళి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, పల్నాడు జిల్లా

మిర్చి నారు ఎండిపోతోంది



గతంలో ఎన్నడూ లేని విధంగా పగటి ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా ఉండటంతో మిర్చి నారు ఎండిపోయి చనిపోతోంది. అనుకున్నంత మిర్చి నారు రైతులకు చెప్పిన సమయానికి అందజేయడం కష్టంగా మారుతోంది. సాధారణంతో పోల్చితే చీడపీడలు అధికంగా ఉండి మందుల పిచికారి ఎక్కువగా చేయాల్సి వస్తోంది. నారుకు ఎండ వేడి తగ్గించేందుకు నీటితో తడిపేందుకు ఎక్కువ సమయం పడుతోంది.

–కొమ్మారెడ్డి జోసఫ్‌రెడ్డి, నర్సరీ యజమాని, రెంటచింతల

న్యూస్‌రీల్

నేటి నుంచి లింగంగుంట్ల అగ్రహారం భూముల సర్వే



నరసరావుపేట: మండలంలో పుష్పగిరి పీఠంకు చెందిన లింగంగుంట్ల అగ్రహారం భూముల విషయంలో మిగిలిన సర్వే పనులు బుధవారం నుంచి చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో దేవదాయశాఖ అధికారులు, రైతులకు చెందిన సమన్వయకమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సర్వే శాఖ ద్వారా భూ వర్గీకరణ మ్యాప్‌లను పరిశీలించారు. ఇంతకు ముందే భూ సర్వే నిర్వహించిన విషయం విదితమే.

గాలివాన బీభత్సం

ఇళ్లపై పడ్డ భారీ వృక్షం



విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షం ఇళ్లపై పడి సుమారు రూ.1,50,000 ఆస్తి నష్టం వాటిల్లింది. గాలివాన తీవ్రతకు స్థానిక సి టైపులోని 26, 27 నెంబర్ గల ఇళ్లపై భారీ వృక్షం పడటంతో ఇళ్లు ధ్వంసం అయ్యాయి. ఇళ్ల పై కప్పు రేకులతో పాటు ఫర్నిచర్ కూడా ధ్వంసం అయ్యాయి. ఇంటి యజమానులు గంటెనపల్లి రమేష్, సీహెచ్ రాజులు నిరాశ్రయులయ్యారు. మంగళవారం రెవెన్యూ అధికారులు ఇళ్లను పరిశీలించి నష్టాన్ని అంచనావేశారు. బాధితులకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్ డిమాండ్ చేశారు.

పదోన్నతులు చేపట్టాకే సర్దుబాటు చేయాలి

ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్ఎం సుభాని



సత్తెనపల్లి: పదోన్నతులు చేపట్టాకే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.ఎం.సుభాని అన్నారు. సత్తెనపల్లిలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయులు సర్దుబాటు ప్రక్రియ చేపట్టే ముందు స్కూల్ అసిస్టెంట్లకు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా, ఎస్టీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చిన తర్వాత పని సర్దుబాటు చేపడితే చాలా వరకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ప్రతి జిల్లాలో 700 నుంచి 800 వరకు రిటైర్డ్ అయిన ఉపాధ్యాయుల ఖాళీలు ఉన్నాయన్నారు. కొన్ని జిల్లాలలో పదోన్నతుల ప్రక్రియ ఇంతవరకు చేపట్టలేదన్నారు. ఆ దిశగా ఆలోచించి చర్యలు చేపట్టాలన్నారు.

దాతల సహకారంతో ప్లాంటేషన్



ప్రత్తిపాడు: దాతల సహకారంతో ప్రత్యేక మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి చెప్పారు. ఈ నెల 24న పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. దీనిలో భాగంగా అనువైన స్థలాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, జెడ్పీ సీఈఓ ఎస్ఎస్ వీబీ వసంతరాయుడు ప్రత్తిపాడు మండలంలో పర్యటించారు. స్థానిక నిమ్మగడ్డవారిపాలెం రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా రెండు వేల మొక్కలను ఒకేరోజు నాటేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకోటయ్యతోపాటు ఉపాధిహామీ అధికారులకు సూచించారు. ఈ ప్రాంతం మొక్కలు నాటేందుకు అనువుగా ఉందని, కార్యక్రమానికి కలెక్టర్ హాజరవుతారని వివరించారు. మొక్కలను దాతల సహకారంతో సమకూర్చుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వారివెంట ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా, ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవో మస్తాన్‌వలి, గ్రామనాయకుడు నిమ్మగడ్డ సతీష్ తదితరులు ఉన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రం

ఆకస్మిక తనిఖీ



వైద్యశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

గురజాల: సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాలను పరిశీలించి వైద్యశాలలో సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. వైద్యశాల ప్రాంగణంలో కలియ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎవరూ అలసత్వం వహించవద్దన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తోపాటు రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణాకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

అందరూ పనిచేస్తేనే పౌరులకు నాణ్యమైన సేవలు

నరసరావుపేట: అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే పౌరులకు నాణ్యమైన సేవలు అందించగలమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. పౌర సేవలు ఏం ఒక్క శాఖకు పరిమితం కాదని, ఇతర శాఖల సహకారంతో ముడిపడి ఉంటాయన్నారు. శాఖలవారీగా సమీక్షించి ప్రాధాన్యత కార్యక్రమాలను వెంటనే పూర్తిచేయాలన్నారు. వికసిత ఏపీ విజన్ 2047 ప్రణాళిక కోసం మండల స్థాయిలో ప్రణాళికలను సెప్టెంబరు 10నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో కె.వినాయకం, జిల్లా, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

27 నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు

పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

సత్తెనపల్లి: విద్యార్థుల సామర్థ్యం అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును సెల్ఫ్ అసెస్మెంట్ (స్వీయ మూల్యాంకనం)గా మార్చుతూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఫార్మేటివ్ అసెస్మెంట్ (నిర్మాణాత్మక మూల్యాం కనం) పేరుతో మూడు రోజులు నిర్వహించే వారు. తాజాగా పరీక్షలు షెడ్యూల్ ప్రకారం ఆరు రోజులు పరీక్ష నిర్వహిస్తారు. స్వీయ మూల్యాంకనం-1 పరీక్షలను ఈనెల 27 నుంచి వచ్చే నెల నాలుగు వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేట్ మినహా అన్ని ప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా పరీక్ష పేపర్లను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

షెడ్యూల్ ఇదీ..

ఈనెల 27 నుంచి వచ్చే నెల రెండు వరకు ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్ష నిర్వహిస్తారు. 28న తెలుగు, 30న ఇంగ్లీష్, 31న గణితం, సెప్టెంబర్ 2న పరిసరాల విజ్ఞానం పరీక్షలు ఉంటాయి. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకూ నిర్వహించనున్నారు. 27న ఓఎస్ఎస్‌సీ, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీష్, 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించనున్నారు.

పకడ్బందీగా స్వీయ మూల్యాంకనం పరీక్షలు

జిల్లాలో ఈనెల 27 నుంచి స్వీయ మూల్యాంకనం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నాం. నిర్మాణాత్మక మూల్యాంకనం పేరును స్వీయ మూల్యాంకణంగా మార్చడం జరిగింది. డీసీఈబీ ముద్రించిన ప్రశ్నపత్రాలు ఆయా పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకుంటాం. 1 నుంచి 8 తరగతుల వరకూ సీబీఏ విధానంలో ఓఎంఆర్ షీట్స్ పై పరీక్షలు నిర్వహిస్తాం. 9,10 తరగతులకు గతంలో లాగానే పరీక్ష ఉంటుంది. రోజుకు ఒక పరీక్ష మాత్రమే ఉంటుంది. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలు పూర్తి చేయనున్నాం.

–ఎం.వెంకటేశ్వర్లు,
జిల్లా విద్యాశాఖ అధికారి, పల్నాడు

ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఈనెల జీతాలు అందక నగరపాలక సంస్థ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 19న సాక్షిలో జీతాలు 'బాబో' శీర్షికన ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. సీఎఫ్ఎంఎస్ అధికారులతో మాట్లాడి 20వ తేదీ మధ్యాహ్నానికి ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో 3,175 మంది ఆప్కాస్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చరిత్ర శిథిలం.. నిర్లక్ష్యం పదిలం

- అమరావతి అభివృద్ధిపై అడుగడుగునా నిర్లక్ష్యం
- పర్యాటక కేంద్రాల ప్రగతి పట్టని అధికారులు
- అసంపూర్తి పనులతో పర్యాటకులకు తప్పని నిరాశ

ఎంతో చరిత్ర కలిగిన ఆధ్యాత్మిక కేంద్రమైన అమరావతిలో పర్యాటకం పడకేసింది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి తొమ్మిదేళ్లు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రగతి ఉంది. 2015లో అమరావతి వారసత్వ నగరంలో అభివృద్ధి అంతన్నారు.. ఇంతన్నారు. ఇప్పటికి ఎంత వరకు వచ్చిందంటే మాత్రం ఎవ్వరూ చెప్పలేని అయోమయ పరిస్థితి నెలకొంది. పనుల అంచనాలు ఘనంగా రూపొందించారు గానీ అమలు చేసిన దాఖలాలు మాత్రం లేవు.

అమరావతి: కేంద్ర ప్రభుత్వం 2015 జనవరిలో వారసత్వ నగరంగా గుర్తించి అమరావతి గ్రామానికి తొలి విడతగా సుమారు రూ.128.50 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. జాతీయ స్థాయి అభివృద్ధి ఏజెన్సీలు, అధికారులు ఇక్కడ చరిత్ర అధ్యయనం, చారిత్రక అంశాల అభివృద్ధికి అంచనాలు రూపొందించారు. ఎప్పటికప్పుడు పనులు, అంచనాలు మార్చటం వల్లే నేటికీ రూ. వంద కోట్ల పనులు నిరుపయోగంగా మారాయి.



వ్యర్థాలతో నూనెగుండం చెరువు

కేటాయింపు ఇలా..

అమరావతిని అభివృద్ధి చేయటానికి పలు పథకాల కింద నిధులు కేటాయించారు. హృదయ్‌లో రూ.54.91 కోట్లు, ప్రసాద్‌లో రూ.73.66 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. హృదయ్ కింద అమరావతి ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు రూ.11 కోట్లు, ఆర్కియాలజీ మ్యూజియంలోని మహా చైతన్య స్తూపానికి రూ.3.26 కోట్లు, ధరణికోట నూనెగుండం చెరువుకు రూ.7.29 కోట్లు, కాలచక్ర మ్యూజియానికి రూ.1.32 కోట్లు, ధరణికోట కోట దిబ్బల అభివృద్ధికి రూ.0.63 కోట్లు, పర్యాటకాభివృద్ధి పరంగా రూ. 25.20 కోట్లు కేటాయించారు. ప్రసాద్ కింద అమర లింగేశ్వరస్వామి దేవాలయానికి రూ.8.52 కోట్లు, ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు రూ.7.71 కోట్లు, స్నాన ఘట్టాలు, కృష్ణా నది తీర అభివృద్ధికి రూ.13.29 కోట్లు, పర్యాటకంగా మౌలిక వసతుల కల్పనకు రూ.24.45 కోట్లు, మండలంలోని వైష్ణవ క్షేత్రం వైకుంఠపురానికి రూ.12.05 కోట్లు కేటాయించారు. ఈ రెండు పథకాల ద్వారా జిల్లాలోని మందడం రాణి రుద్రమదేవి గుడికి రూ.98 లక్షలు, ఉండవల్లి గుహలకు రూ.1.37 కోట్లు, మంగళగిరి నరసింహ స్వామి దేవాలయానికి రూ.1.63 కోట్లు, కొండవీటి కోటకు రూ.4.83 కోట్లు, కోటప్పకొండ త్రికోటేశ్వరుడి దేవాలయానికి రూ. 5.03 కోట్లు కేటాయించినట్లు అధికారులు అప్పట్లో వెల్లడించారు.



నదిలోకి చేరుతున్న మురుగు

అమరావతి, ధరణికోటలలో ఇదీ పరిస్థితి..

2016 పుష్కరాలకు అమరేశ్వరాలయానికి వారసత్వ నగరాభివృద్ధి నిధుల నుంచి కేటాయించిన మొత్తంతో ఆలయంలో అభివృద్ధి పనులు చాలా వరకు పూర్తి చేశారు. గుడికి ఉత్తరంగా కృష్ణానదిలో ధ్యానబుద్ధ ఘాట్ నుంచి అమరేశ్వర ఘాట్ వరకు చేపట్టిన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ధరణికోట నూనెగుండం చెరువు పనులు కూడా కొంత మేర పూర్తి చేశారు. కానీ నేడు అవీ శిథిలావస్థకు చేరాయి. ఈ గ్రామాలలో చారిత్రక ప్రదేశాలను కలుపుతూ నిర్మించిన హెరిటేజ్ వాక్ నిరుపయోగంగా మారింది. ధ్యానబుద్ధ ప్రాజెక్టు పనులు కూడా అంతంత మాత్రంగానే పూర్తయ్యాయి. పురావస్తు మ్యూజియాలలో కూడా పెద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. రూ.కోట్లు ఖర్చు పెట్టిన పుష్కర ఘాట్‌లు వ్యర్థాలతో నిండిపోయాయి. రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఈ గ్రామాల నాలుగు వైపులా ఆర్చీలు కూడా ఆధ్యాత్మిక, చారిత్రక వారసత్వానికి బదులుగా రియల్ ఎస్టేట్ వెంచర్ల తరహాలో ఉన్నాయి. అమరేశ్వర ఘాట్ వద్ద కృష్ణానదిలో రూ.4 కోట్లతో ఆడియో, వీడియోలతో ఏర్పాటు చేసిన లేజర్ షో నేటికీ కలగా మిగిలింది. గతంలో వచ్చిన వరదలకు నదిలో రూ.కోట్లతో ఏర్పాటు చేసిన కొన్ని సాంకేతిక పరికరాలు కొట్టుకుపోవడంతో పర్యాటక శాఖ అధికారులు లేజర్ షోని నిలిపేశారు. ఉన్న కొంత సామగ్రిని మరో చోటుకు తరలించారు. పర్యాటకులకు అమరేశ్వరాలయం, ధ్యానబుద్ధ విగ్రహం మాత్రమే ఇప్పుడు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని పురావస్తు ప్రదర్శన శాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. అమరావతి ఆర్కియాలజీ మ్యూజియానికి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే.



పుష్కర ఘాట్‌లలో చెత్తాచెదారాలు

మూతపడిన పర్యాటక శాఖ మ్యూజియం

రూ.కోట్ల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఖర్చు చేసిన పర్యాటక శాఖ మ్యూజియం ఇప్పుడు మూతపడింది. 2004 పుష్కరాలకు నిర్మించిన ఈ మ్యూజియాన్ని ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రపంచ బౌద్ధ గురువు దలైలామా ప్రారంభించారు. 2015లో వారసత్వ నగర నిధులు సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు మొదలు పెట్టారు. ఇంతవరకు అవి పూర్తి కాలేదు. కొంతకాలంగా మ్యూజియం మూతపడింది. ఆవరణలో ఉన్న హరిత హోటల్‌ను మద్యం షాపు నిర్వహణ నిమిత్తం ఎక్సైజ్‌శాఖకు అప్పగించారు. ప్రస్తుతం దీని పరిసరాలలో వాహనాల పార్కింగ్, తాత్కాలిక దుకాణాలు మాత్రమే ఉన్నాయి.



ఇష్టారాజ్యంగా నిధుల వినియోగం



వారసత్వ నగరంగా ప్రకటించిన అమరావతిలో పర్యాటక అభివృద్ధికి కేటాయించిన నిధులు సద్వినియోగం కాలేదు. సరైన ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యంగా ఖర్చు చేశారు. పర్యాటకులకు ఆహ్లాదకరమైన ప్రదేశమే లేదు. బుద్ధ భగవానుడి శిల్పాలున్న మ్యూజియం ఆవరణలో మద్యం షాపు నడపటం తగదు. వెంటనే దానిని తొలగించాలి.

– బి సూరిబాబు,
సీపీఎం మండల కార్యదర్శి,అమరావతి

అధికారుల నిర్లక్ష్యమే శాపం



ఎంతో ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన అమరావతి గురించి వివరించడానికి కనీసం గైడ్ కూడా లేరు. అమరావతి పురావస్తు మ్యూజియానికి వెళ్లాలంటే ఆ ప్రాంతంలో మూత్ర విసర్జన దుర్వాసన భరించాల్సిన దుస్థితి ఏర్పడింది. మ్యూజియం, ధ్యాన బుద్ధ విగ్రహం, అమరావతి స్తూపం వంటి ప్రదేశాలను సూచించే బోర్డులు కూడా లేవు. టూరిజం శాఖ అమరావతిని పూర్తిగా మరిచిపోయింది. అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది.

– కారసాల ప్రసన్నకుమార్, అమరావతి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

ప్రస్తుతం జిల్లాలోని అన్ని పర్యాటక కేంద్రాలలో ప్రత్యేక ప్రదేశాలను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడానికి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నాం. అమరావతిలోని హరిత హోటల్ వద్ద మద్యం షాపు తొలగించటానికి గతంలో సిఫార్సు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– కృష్ణ చైతన్య,
డీవీఎం, పర్యాటక శాఖ

క్లుప్తంగా

23 నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

నరసరావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న పనులపై ఈనెల 23వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఉపాధి హామీ పథకం వేతనాలు కోరే వారికి వారి హక్కులు, అర్హతలపై గ్రామసభల్లో అవగాహన కల్పిస్తారని తెలిపారు. ప్రస్తుతం మంజూరు చేయబడిన, పురోగతిలో ఉన్న పనుల వివరాలను ఈ సభల్లో చదివి వినిపించాలని తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల కోసం ప్రతిపాదనలను గ్రామసభలో తెలియజేసి ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు. దీంతోపాటు సామాజిక తనిఖీ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరిగే గ్రామసభల్లో ప్రజలు పాల్గొని కొత్త పనులను గుర్తించాలని కోరారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



పిడుగురాళ్ల: మాచర్ల నుంచి విజయవాడ వెళ్లే రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీనివాస కాలనీకి వెళ్లే మొండిగేటు సమీపంలో మంగళవారం జరిగింది. నడికుడి రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల నుంచి విజయవాడ రైలు వెళ్తుండగా శ్రీనివాసకాలనీ సమీపంలోని మొండి గేటు వద్ద సుమారు 40 సంవత్సరాలు గల వ్యక్తి రెండు పట్టాల మధ్యలో కూర్చొని ఉన్నాడు. డ్రైవర్ గమనించి హారన్ కొట్టినప్పటికీ ఆ వ్యక్తి రెండు పట్టాల మధ్యలో కూర్చున్నాడు. ఈ సమయంలో రైలు అతనిని ఢీకొంది. ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన ఉదయం 6గంటల సమయంలో జరిగింది. మృతుడు తెల్ల చొక్కా ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9440438256నంబర్‌లోసంప్రదించాలన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రోత్సహించండి

- జిల్లా కలెక్టర్‌కు సూచించిన పారిశ్రామికవేత్తలు
- కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక పాలసీ తయారీ సమావేశం



కలెక్టరేట్‌లో పారిశ్రామికవేత్తలు, అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో పరిశ్రమలకు భారమైన విద్యుత్ చార్జీలను తగ్గించి తగిన ప్రోత్సహకాలు అందజేసి ఆదుకోవాలని పారిశ్రామికవేత్తలు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాలో పారిశ్రామిక పాలసీ తయారీ, పరిశ్రమల అభివృద్ధిపై డీఐఈపీసీ సమావేశం నిర్వహించారు. 2024–29కి సంబంధించి ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్, ఎంఎస్ఎంఇ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీలు, ఫుడ్ ప్రాసెసింగ్ రూపకల్పనపై చర్చించారు. స్పిన్నింగ్ మిల్స్ అండ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఏపీలో 36లక్షల స్పిండిల్స్ ఉంటే జిల్లాలో 15 లక్షలు ఉన్నాయని అన్నా రు. పెరిగిన విద్యుత్ చార్జీల ప్రభావంతో స్పిన్నింగ్ మిల్లులపై ఉత్పత్తి వ్యయం 35శాతం అధికమైందన్నారు. 10శాతం మూలధన రాయితీ ఇవ్వాలని కోరారు. 2018–23 మధ్య తీసుకున్న పాలసీలోని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రూ.2లకు విద్యుత్ టారిఫ్ అందించాలని అన్నారు. గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో 150 యూనిట్లు ఉండగా ప్రోత్సహకాలు అందజేయలేదన్నారు. రూ.2లకే యూనిట్ విద్యుత్ అందజేయాలని, పరిశ్రమలకు సోలార్ పవర్ అందించాలని కోరారు. జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్, డీటీసీ టి.పరంధామరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలిని బంధించి చైన్ అపహరణ

- రేషన్ బియ్యం కొంటామని వచ్చి దోచుకున్నారు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు



సీతామహాలక్ష్మి

పెదకూరపాడు: ఓ వృద్ధురాలిని బెదిరించి, చీర కొంగుతో బంధించి ఆమె మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారం అపహరించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామంలోని బుచ్చియ్యపాలెం రోడ్డులో 70సంవత్సరాలు వయస్సు కలిగిన చుండు సీతామహాలక్ష్మి ఒంటరిగా జీవిస్తోంది. మరో వీధిలో ఆమె పిల్లలు నివాసం ఉంటున్నారు. కొందరు యువకులు రేషన్ బియ్యం కొంటామని ఆ చుట్టు పక్కల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సీతామహాలక్ష్మి గృహంలో ఒక వ్యక్తి చొరబడ్డాడు. వృద్ధురాలు నోరు మూసి ఒంటిపై ఉన్న నాలుగు సవర్ల బంగారం ఇవ్వాలని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైౖ వృద్ధురాలు సీతామహాలక్ష్మి తన మెడలోని చైన్ తీసి ఇచ్చింది. చెవ్వులకు ఉన్న దుద్దులు తీసుకునే ప్రయత్నం చేయగా అవి నకిలీవి అని చెప్పడంతో వాటి జోలికి వెళ్లలేదు. చీర కొంగుతో పక్కన ఉన్న కుర్చీలో వృద్ధురాలిని బంధించి దుండగుడు పరారయ్యారు. మరో దుండగుడు రోడ్డుపై ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద బైక్‌తో సిద్ధంగా ఉన్నాడు. అనంతరం ఇద్దరూ కలసి బైక్‌పై పరారయ్యారు. కొంత సమయం తరువాత వృద్ధురాలు చీర కొంగు ముడిని విడిపించుకోని బయటకు వచ్చి కేకలు వేసి స్థానికులకు జరిగిన సంఘటన తెలిపింది. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బాలూనాయక్ సిబ్బందితో వచ్చి స్థానికంగా ఉన్న శ్రీ కాకతీయ పాఠశాలలో ఉన్న సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. బైక్‌పై వెళ్తున్నట్లు సీసీ పుటేజ్‌లో కనిపించడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గత శుక్రవారం ఇదే ప్రాంతంలో శాఖమూరి శ్రీనుకు చెందిన పాడి గేదె అపహరణకు గురైంది. గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు.

మూడుకు చేరిన మృతుల సంఖ్య



కొల్లి భూపతి

నాదెండ్ల: నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్‌పాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. నరసరావుపేట–చిలకలూరిపేట రహదారిపై ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటనలో కారుమూరి ఆంజనేయులు, సూరె ప్రభావతి అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలతో గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొల్లి భూపతి (35) మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం నకరికల్లు మండలం కుంకలగుంట. ప్రమాదంలో మృత్యువాతపడిన కనుమూరి ఆంజనేయులుకు ఈయన మేనల్లుడు. ఈయన నరసరావుపేట సమీపంలోని ఓ కోల్డ్‌స్టోరేజీలో పనిచేస్తుంటాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాపట్ల జిల్లా నరసాయపాలెం గ్రామానికి చెందిన కనుమూరి ఆంజనేయులు మూడో కుమారుడైన శ్రీనివాసరావు విదేశాల్లో ఉద్యోగం చేస్తుంటాడు. ఇటీవల స్వదేశానికి వచ్చిన శ్రీనివాసరావు, తన కుమార్తె ఓణీల ఫంక్షన్‌ను సోమవారం మధ్యాహ్నం నిర్వహించాడు. ఈ వేడుకకు హాజరై తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

చట్టానికి లోబడి వ్యాపారం చేయాలి

ఎరువుల డీలర్లతో వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీ కృపాదాస్



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ కృపాదాస్ చిత్రంలో నున్న వెంకటేశ్వర్లు

కొరిటెపాడు(గుంటూరు): చట్టానికి లోబడి డీలర్లు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ అడిషనల్ డైరెక్టర్(ఏడీ) వీడీవీ కృపాదాస్ చెప్పారు. గుంటూరు అరండల్‌పేటలోని ఫర్టిలైజర్స్ కల్యాణ మండపంలో ఎరువుల నియంత్రణ చట్టంపై డీలర్లు, వ్యాపారులు, వ్యవసాయశాఖ అధికారులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో లైసెన్స్‌లు పొందిన డీలర్లు, వ్యాపారులు కొత్త జిల్లాల పరిధిలోనే వ్యాపారం చేయాలని కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ఎరువులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పక్క రాష్ట్రాల్లో ఎరువుల సమస్య ఉందని, రాష్ట్రంలో లేదని వెల్లడించారు. డీలర్లు, వ్యాపారులు సామాజిక బాధ్యతను మరవరాదని చెప్పారు. అవతకవలకు పాల్పడితే లైసెన్సులు రద్దుచేస్తామని, సంబంధిత అధికారులపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించడం, ఎమ్మార్పీ కంటే మించి అమ్మడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ శాఖ సహకారం ఎప్పుడూ ఉంటుందని వివరించారు. విచక్షణా రహిత ఎరువుల వాడకాన్ని విడనాడాలని రైతులకు తెలియజేయాలని సూచించారు.

ఈ–పోస్ ద్వారానే అమ్మకాలు జరగాలి

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ–పోస్ ద్వారానే ఎరువులు అమ్మకాలు జరగాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిదని వివరించారు. ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.నాగిరెడ్డి మాట్లాడుతూ ఈనెల చివరిలో ఆల్ ఇండియా ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ సమావేశం ఢిల్లీలో జరగనుందని, సమావేశంలో సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. అనంతరం వ్యవసాయశాఖ కమిషనరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజన్ ఎరువుల చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఐపీఎల్ కంపెనీ ప్రతినిధి లోకమూర్తి, గుంటూరు ఏడీఏ సునీల్, జిల్లాలోని ఏడీఏలు, ఏఓలు, డీలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

సర్కారు అగ్రకుల కూటమి



పుస్తకాలను స్వీకరించిన వారితో డాక్టర్ పద్మారావు

పొన్నూరు: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జీవన విధానాన్ని యువకులు అలవర్చుకోవాలని ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌ను పామర్రుకు చెందిన ప్రముఖులు కోటే రామనాథ్, కాకి కిరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు మాట్లాడుతూ గ్రామీణ అంబేద్కర్ యువజన సంఘాలు, దళితుల ఐక్య సంఘటన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రభుత్వం అగ్రకుల కూటమి అని, సర్కారు అగ్రవర్ణాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహాల మీద కూడా దాడులు చేయటం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఉద్యమం మొదటి నుంచి ఆత్మగౌరవంతో నడిచిందని, కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట వంటి అన్ని పోరాటాల్లో అగ్రకులాలను ఎదిరించి ఎన్నో హక్కులు సాధించామని వెల్లడించారు. రాబోయేది దళిత బహుజన రాజ్యమేనని, ఈ అగ్రవర్ణాల కూటమి ఎంతో కాలం ఉండదని పేర్కొన్నారు. సంపద పంచుకునే విషయంలో అగ్రకులాల్లో వైరుధ్యాలు వస్తాయని, వేచి చూడాలని చెప్పారు. పద్మారావు రచించిన కొన్ని గ్రంథాలను సందర్శకులు స్వీకరించారు.

కేఎల్‌యూలో మహిళా బిజినెస్ సమ్మిట్



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి కొండపల్లి

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో మంగళవారం మహిళా బిజినెస్ సమ్మిట్‌ను నిర్వహించారు. రాష్ట్ర స్మాల్ మీడియం ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (ఎంఎస్ఎంఈ) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేఎల్‌యూ కార్యదర్శి కోనేరు శివకాంచనలత ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మంత్రి మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాలలో ప్రోత్సాహకాలు ఉంటాయని వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతికి కృషి చేస్తామన్నారు. కోనేరు శివకాంచనలత మాట్లాడుతూ రాబోయే తరానికి మహిళా పారిశ్రామికవేత్తలే దిక్సూచి అని చెప్పారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.రాఘవరావు, డి.అశోక్‌కుమార్, కేంద్ర ఎంఎస్ఎంఇ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, నారీ శక్తి అవార్డు గ్రహీత రమాదేవి, యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ వెంకట్రామ్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులివ్వాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ నాగలక్ష్మిని కలిసిన ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు అధికారపార్టీ హామీ ఇచ్చిందని, దానిని నిలబెట్టుకోవాలని కోరారు. చానల్‌ను పొడిగిస్తే ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, బాపట్ల, పర్చూరు మండలాలకు చెందిన 50 గ్రామాలకు, 80వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతుందని వివరించారు. స్పందించిన కలెక్టర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వివరించారు. ఎమ్మెల్సీ వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఎం పెదనందిపాడు మండల కార్యదర్శి డి.రమేష్‌బాబు ఉన్నారు.

వాహనం ఢీకొని యాచకుడు మృతి

మేదరమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి చెందాడు. ఈ ఘటన కొరిశపాడు మండలం తిమ్మనపాలెం పండు హోటల్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... సుమారు 60 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి రోడ్డు దాటే క్రమంలో ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అతడు ఈ ప్రాంతంలో ఉంటున్న యాచకుడని దర్యాప్తులో తేలింది. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కలసి రావాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి
- ప్రపంచ దోమల దినోత్సవం ర్యాలీ



ర్యాలీకి పచ్చజెండా ఊపుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి

నరసరావుపేట: దోమల వ్యాప్తి నిరోధానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. 1897 ఆగస్టు 20న ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా ఒకరి నుంచి మరొకరికి మలేరియా వ్యాప్తి జరుగుతుందని సర్ రొనాల్డ్‌రాస్ కనుగొన్న సందర్భంగా ప్రపంచ దోమల దినోత్సవాన్ని ఆరోగ్యశాఖ అధికారులు పాటించారు. మంగళవారం రొనాల్డ్‌రాస్ చిత్రపటానికి డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ బి.రవీంద్ర రత్నాకర్, మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీకి డాక్టర్ రవి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఉద్యోగుల చేత దోమల నిర్మూలనకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనరు సి.రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ మురుగు కాలువల్లో చెత్త, మిగిలిన అన్నం వేయటం వలన పారకుండా ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెంది తద్వారా రోగాలు ప్రబలుతున్నాయన్నారు. డాక్టర్ రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ పనికిరాని వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. దీని వలన దోమలు వృద్ధి చెందకుండా ఉండటం ద్వారా మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, డెంగీ, మెదడువాపు వ్యాధి లాంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, ఏఎంవో సీహెచ్.వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ అధికారులు కొల్లిపర శ్రీనివాస్, కుంచాల శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలన అందరి బాధ్యత



రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీ విజేతలతో వైద్య, ఎన్జీఓ సంస్థల సిబ్బంది

డాక్టర్ మురళీకృష్ణ

నరసరావుపేటఈస్ట్: ఎయిడ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు యూత్ ఫెస్ట్–2024–25 భాగంగా పల్నాడు జిల్లా దిశా క్లస్టర్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో విద్యార్థులకు రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8, 9 తరగతులు విద్యార్థులు, ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం చదివే విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనలో యువత ప్రత్యేకంగా కృషి చేయాలని తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యువత పాత్ర అధికమన్నారు. విద్యార్థి స్థాయి నుంచే సమాజం పట్ల బాధ్యత కలిగి దురవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మద్యం, మాదక ద్రవ్యాలతోపాటు ప్రాణాంతకారిగా మారిన ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలో శ్రావణి, నాగశ్రీ (శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్) ప్రథమ, పల్లవి, శివహాసిని (జెడ్పీ హైస్కూల్, చల్లగుండ్ల) ద్వితీయ, బాలఅజయ్, విజయభాస్కర్‌రెడ్డి(జెడ్పీ హైస్కూల్, వి.రెడ్డిపాలెం) తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో ఏపీ సాక్స్ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాషా, జిల్లా సైన్స్ ఆఫీసర్ రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.సులేఖ, టీఐ స్వచ్ఛంద సంస్థ హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రోగ్రామ్ మేనేజర్ ఉదయరాజ్, రీడ్స్ సీఎస్సీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ షేక్ మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

పత్తిలో బెట్ట నివారణ చర్యలు చేపట్టాలి

డీఏవో ఐ.మురళి



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

నరసరావుపేట రూరల్: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పత్తి పంటలో బెట్ట నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని కేఎం అగ్రహారంలో పత్తి పంటలను మంగళవారం ఎఫ్‌టీసీ డీడీఏ ఎం.శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మతో కలిసి ఆయన పరిశీలించారు. పత్తిలో గులాబీ రంగు పురుగుతోపాటు తెల్లదోమ, పచ్చ దోమను గుర్తించారు. పురుగు ఉధృతి కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. గులాబీ రంగు పురుగు గుర్తించేందుకు ఎకరానికి ఐదు చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా పురుగు ఉధృతిని గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణంలో మార్పులతో వేడి పెరగడంతో పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తుందన్నారు. పత్తిలో బెట్ట వలన పంటకు నష్టం కలుగకుండా ఉండేందుకు పై పాటుగా 19 19 19 ఐదు గ్రాములు లీటరు నీటితో లేదా మల్టీ కే 10 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దీని వలన పైరు బెట్టకు రాకుండా వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుందని వివరించారు. తెల్ల దోమ, పచ్చ దోమ నివారణకు డయాఫెంథియురాన్ 250 గ్రాములు ఎకరానికి పిచికారి చేయాలని తెలిపారు. తామర పురుగు నివారణకు ఫిప్రోనిల్ 3మి.లీటర్లను లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అనంతరం ఈ–క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. రైతులు తమ పంటలను ఈ –క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డుల కోసం వ్యవసాయ సహాయకుడు లేదా గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు పవన్, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డబుల్ రోడ్డు పనులు



అమరావతి–బెల్లంకొండ డబుల్‌రోడ్డు పనులు

క్రోసూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి–బెల్లంకొండ డబుల్ రోడ్డు పనులు మందగించాయి. స్థానికులు అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఇచ్చిన హామీ మేరకు రూ.149 కోట్లతో అమరావతి–బెల్లంకొండ డబుల్ పనులు చేపట్టారు. రహదారి విస్తరణలో భాగంగా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తుండగా కొన్నిచోట్ల రోడ్డు మార్జిన్ వెడల్పు చేసి గ్రావెల్‌తో చదును చేసే పనులు పూర్తి చేశారు. కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణాలు చేపట్టారు. పాత రోడ్డు పూర్తిగా ధ్వంసం కావటం, గుంతలమయం కావటం, దానిపై కొత్త రోడ్డు కోసం గ్రావెల్ వేయటంతో రోడ్డుపై తీవ్రంగా దుమ్ము ధూళి ఇళ్లల్లోకి వస్తుందని రోడ్డు పక్కన నివసిస్తున్న గృహాల ప్రజలు వాపోతున్నారు. త్వరగా రోడ్డు పనులు పూర్తిచేస్తే దుమ్ము, ధూళి సమస్య లుండవని అంటున్నారు. మంగళవారం క్రోసూరు గ్రామశివారు రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు. ఆర్అండ్‌బీ ఏఈ పున్నారావును వివరణ కోరగా బిల్లుల విడుదలను బట్టి పనులు చేస్తున్నారని, పనులు ఆగకుండా చేస్తారని తెలిపారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

- బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు
- డీఎస్పీ విచారణ
- కేసు నమోదు చేసిన పోలీసులు



రామాంజనేయపురంలో విచారణ చేస్తున్న డీఎస్పీ గురనాథబాబు

బెల్లంకొండ: బాలికపై ఓ యువకుడు లైంగికదాడికి యత్నించాడంటూ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని స్థానిక ఎస్‌ఐ రాజేష్ మంగళవారం తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాంజనేయపురం గ్రామానికి చెందిన నెల్లూరి లోకేష్ గ్రామంలోని సుగాలీకాలనీకి చెందిన బాలికపై ఆదివారం సాయంత్రం అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు యువకునిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో కేసు నమోదు చేశామన్నారు. మంగళవారం సత్తెనపల్లి డీఎస్పీ గురనాథబాబు, క్రోసూరు సీఐ సురేష్‌లు స్థానిక ఎస్‌ఐ రాజేష్‌తో కలసి రామాంజనేయపురం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఘటనపై పూర్తి వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. కావాలనే తన కుమారునిపై కేసు బనాయించారని నిందితుని తండ్రి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశాడు. వారి ఇంట్లో పెంపుడు కుక్క అటువైపుగా వెళ్లడంతో తన కుమారుడు వారి ఇంటి వైపు వెళ్లాడన్నారు. అటు వైపుగా వెళ్లిన తన కొడుకుపై మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారని, వెంటనే మేము పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వారిపై ఫిర్యాదు చేశామన్నారు. దీంతో తమపై తిరిగి కేసు పెట్టేందుకు కావాలనే తన కుమారునిపై లైంగికదాడి కేసు పెట్టారని తెలిపారు.